

పారదర్శకంగా కులగణన

తిరుపతి శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం నిర్వహించిన సదస్సులో కులగణనపై దిశానిర్దేశం చేశారు. - 8లో



సులువుగా 'సర్టిఫికెట్'

జగనన్న సురక్ష కింద ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సులభతరంగా అందించడంపై జనవాక్కు. - 8లో



సేంద్రియ సాగు అభినందనీయం

సేంద్రియ విధానంలో రైతులు సాగు చేస్తున్న పంటను అంతర్జాతీయ ప్రతినిధుల బృందం పరిశీలించింది. - 8లో

న్యూస్‌రీల్

గోపీనాథపట్నంలో 'ధర్మ ప్రచార రథం'



వినాయకస్వామిని దర్శించుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

కాణిపాకం(యాదమరి): తాడేపల్లిగూడెం సమీపంలోని ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో కాణిపాకం వరసిద్ధి వినాయస్వామి ఆలయ ధర్మ ప్రచార రథం మంగళవారం పర్యటించింది. శ్రీభక్తాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా ప్రచార రథం అక్కడకు చేరుకుంది. ఈ క్రమంలో భక్తాంజనేయ స్వామితోపాటు రథంలోని వరసిద్ధుని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి స్వామివారి తీర్థప్రసాదాలను ప్రచార రథం ఇన్‌చార్జి రమేష్ అందించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ సభ్యులు రాజగోపాల్, చక్రవర్తి పాల్గొన్నారు.

ఈఓ వెంకటేశు పదవీకాలం పొడిగింపు



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈఓ వెంకటేశు పదవి కాలం మరో ఏడాది పాటు పొడిగిస్తూ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వల్లవన్ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.

స్కూల్ బస్సులు.. ఆటోల తనిఖీ



వాహనాల తనిఖీలో రవాణాశాఖ అధికారులు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు మంగళవారం స్కూల్ బస్సులు, విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లే ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ లేనివి, ఎఫ్‌సీ చేయని, సక్రమంగా రికార్డులు లేని బస్సులను గుర్తించారు. ఆటోల్లో పిల్లలను తీసుకెళుతున్న డ్రైవర్లపై మండిపడ్డారు. ఇకపై నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదేశాలను బేఖాతర్ చేస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరిపైరు

బంగారుపాళెం : మండలంలోని రాళ్లవంక గ్రామంలో సోమవారం రాత్రి ఏనుగుల దాడిలో పలువురు రైతులు సాగుచేస్తున్న పంటలు ధ్వంసమయ్యాయి. వేలుమందడి, రమేష్, మొగిలప్పకు చెందిన వరి, మామిడితోటను నాశనం చేశాయి. గజ బీభత్సంతో బండ్లదొడ్డి, కీరమంద, వేపనపల్లె, సామచేనుమిట్ట, టేకుమంద, మొగిలి, మొగిలివారిపల్లె తదితర గ్రామాల రైతులకు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎవరి పంటలపై దాడి చేస్తాయో అని వణికిపోతున్నారు. ఈ క్రమంలో దెబ్బతిన్న పంటలను మంగళవారం అటవీశాఖ అధికారులు సందర్శించారు. నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బైరెడ్డిపల్లె : మండలంలోని కడతట్లపల్లె వద్ద వరలక్ష్మి అనే రైతు సాగు చేస్తున్న 3 ఎకరాల అరటి తోటను సోమవారం రాత్రి ఏనుగుల గుంపు నాశనం చేసింది. కోత దశలో ఉన్న పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్ట పోయామని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేసింది. కోదండ అనే రైతుకు చెందిన వరిపైరును సైతం ఏనుగుల తొక్కేశాయి.



ఏనుగులు విరిచేసిన అరటి చెట్లు

విజయమే నీ లక్ష్యం!

విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి రోజా

సభకు హాజరైన విద్యార్థులు



"ప్రతి విద్యార్థినీ జీవితంలో ఎదిగేందుకు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. అధిగమించేందుకు కఠోరంగా శ్రమించాలి. ఎంచుకున్న మార్గంలో విమర్శలు.. అంటకాలు.. అవమానాలు ఎదురైనా ధైర్యంగా తిప్పికొట్టాలి. ప్రతి క్షణం తల్లిదండ్రులు మన కోసం పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ.. వారి ఆశలు.. ఆకాంక్షలను నెరవేర్చే దిశగా దూసుకుపోవాలి." అని మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతి శ్రీపద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆమె ఉద్వేగభరితంగా ప్రసంగించారు.

- విద్య, క్రమశిక్షణకు నిలయం ఎస్పీడబ్ల్యూ కళాశాల
- ఆడపిల్లలను అన్నిరంగాల్లో ప్రోత్సహించింది సీఎం జగనన్నే
- నా జీవితాన్ని మలుపు తిప్పింది పద్మావతి కళాశాల
- పూర్వ విద్యార్థుల సభలో మంత్రి రోజా భావోద్వేగం

తిరుపతి సిటీ: విజయమే లక్ష్యంగా విద్యార్థినులు కష్టపడి చదవాలని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కళాశాలకు రావాలని ఎదురుచూశానని, నేడు మంత్రి హోదాలో కల సాకరమైందన్నారు. ఎన్నో కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యానని, కానీ ఈ కార్యక్రమానికి హాజరు కావడం జీవితంలో మరిచిపోలేనని చెప్పారు. పద్మావతీ డిగ్రీ కళాశాల విద్యతో పాటు క్రమశిక్షణకు నిలయమని కొనియాడారు. ప్రతి విద్యార్థినీ ఉన్నత లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని అందుకోసం కష్టపడాలన్నారు. ఇందుకు ప్రధాన సాక్షి తన జీవితమేనన్నారు. కళాశాల, తల్లిదండ్రులు గర్వించేలా మన ప్రవర్తన ఉండాలన్నారు. సీఎం జగనన్న ఆడపిల్లలను అన్ని రంగాల్లోనూ రాణించేలా తీర్చిదిద్దారని, అండగా నిలబడి మహిళా పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. కళాశాల మనకు విద్యతోపాటు, జీవిత పాఠాలు నేర్పుతుందన్నారు. ఈ కళాశాలలో చదువుతోంది ఆడపిల్లలు కాదు ఆడ పులులని నిరూపించాలన్నారు. మీరు వేసే ప్రతి అడుగూ పది మందికి ఆదర్శం కావాలని విద్యార్థినులకు సూచించారు. 70 ఏళ్లుగా నడుస్తున్న అతి పురాతన కళాశాలను గర్వించదగ్గ రీతిలో తీర్చిదిద్దుతున్న టీటీడీ, అధ్యాపకులు, సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈఓ ఎం భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మహదేవమ్మ, ప్రేమావతి, డాక్టర్ కృష్ణప్రశాంతి, అధ్యాపకులు విద్యాలత, వసుధ తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగం..మంత్రి ప్రసంగం

ఎస్పీడబ్ల్యూ కళాశాలలో తాను చేసిన చిలిపి చేష్టలు, అల్లరిని గుర్తుచేసుకుంటూ చెమర్చిన కళ్లతో మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. 33 ఏళ్లకు ముందు ఇక్కడ విద్యార్థినిగా ఉన్నానని, మళ్లీ విద్యార్థులతో కలిసి ఇక్కడ చదవాలని ఆశగా ఉందన్నారు. తాను సైన్స్ విద్యార్థినని, ఫిజిక్స్ అంటే తనకు భయంగా ఉండేదన్నారు. విద్యార్థులు ఆమెకు రోజా పూలు చూపిస్తూ ఘన స్వాగతం పలకారు. మంత్రిని ఈ సందర్భంగా కళాశాల అధికారులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.



మంత్రి రోజాను సన్మానిస్తున్న కళాశాల అధికారులు, అధ్యాపకులు

సెల్ఫీల జోరు

మంత్రి రోజా ఎస్పీడబ్ల్యూ కళాశాల ఆవరణలోకి చేరుకోగానే విద్యార్థులు ఉప్పొంగిన అభిమానంతో ఘన స్వాగతం పలికారు. కేరింతలు కొడుతూ, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. వారి అభిమానానికి మంత్రముగ్ధురాలైన మంత్రి రోజా దబిడి దిబిడే, తగ్గేదేలే అనే సినీ డైలాగులతో యువతను ఉర్రూతలూగించారు. అనంతరం ఆమె విద్యార్థినులతో సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఏకైనా నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి రోజా కొనియాడారు. మంగళవారం పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన అల్యూమిన్ని సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆడపిల్లల చదువుకోసం జగనన్న చేస్తున్న కృషిని మహిళలు మరిచిపోరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మహిళలు అండగా నిలిచి మళ్లీ సీఎంగా చేసుకుంటామని సంతోషంగా చెబుతున్నారని వెల్లడించారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు దబిడి దిబిడే అని స్పష్టం చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి సత్కారం



ఎంపీ మిథున్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న కబడ్డీ సంఘం ప్రతినిధులు

చౌడేపల్లె : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కబడ్డీ సంఘం ప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. చౌడేపల్లెలో టోర్నీ జరిపించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. పోటీల నిర్వహణ తీరును ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ కబడ్డీ టోర్నమెంట్‌ను సమష్టిగా పనిచేసి విజయవంతం చేశారని నిర్వాహకులను అభినందించారు. రాష్ట్ర కబడ్డీ సంఘ అధ్యక్షుడు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, సర్పంచ్ వరుణ్‌భరత్, పూర్వపు విద్యార్థులు పిల్లారి జీవన్‌ప్రకాష్, లీలాకుమార్, కడియాల మహేష్ బాబు, రాము పాల్గొన్నారు.

ఆదర్శనీయులు 'పూలే'



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శనీయులని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే విశేషంగా కృషి చేశారని కొనియాడారు. శ్రామిక ప్రజల కోసం 1855లోనే రాత్రిబడి స్థాపించారని వెల్లడించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, హౌసింగ్ పీడీ పద్మనాభం పాల్గొన్నారు.

యువతకు మెరుగైన శిక్షణే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని యువతకు మెరుగైన శిక్షణ అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్)తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్త ఒప్పంద కుదుర్చుకున్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో ఐఓసీఎల్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన నిరుద్యోగులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందించనున్నట్లు వెల్లడించారు. పైప్‌లైన్ సౌకర్యమున్న గ్రామాలకు ఆర్‌ఓ యూనిట్లను ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. అనంతరం రూ.18,65,200 సీఎస్‌ఆర్ చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ అడిషనల్ డైరెక్టర్ దినేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ బాలమురుగన్, సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్ రఘువంశీ, జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖాధికారి గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంఓయూ మార్చుకుంటున్న ఐఓసీఎల్ ప్రతినిధులు

'గజ' కట్టడికి పకడ్బందీ ఫెన్సింగ్



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు బయటకు రాకుండా పకడ్బందీగా ఫెన్సింగ్ వేయిస్తామని ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. మంగళవారం టీఎస్ అగ్రహారంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను పలువురు రైతులు కలిసి ఏనుగుల దాడిలో పంటలు నష్టపోతున్నామని విన్నవించారు. ఆయన స్పందిస్తూ ఏనుగుల కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ చైర్మన్లు గుల్జార్, రవి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పోటీల నిర్వహణ, రిజిస్ట్రేషన్‌ల అంశాలను వివరించారు. పోటీలలో ప్రభుత్వ ఉద్యోగులు తప్ప మిగిలిన వర్గాల్లో 15 ఏళ్లు నిండినవారు పాల్గొనవచ్చని చెప్పారు. ఇందుకు కోసం సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 10 వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వ తేదీ వరకు 51 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, మారథాన్, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి నింపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక్కో క్రీడాకారుడు గరిష్టంగా 2 క్రీడలకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. అనంతరం పోటీల మస్కట్ లోగో, పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, డీఈఓ విజయేంద్రరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా సంక్షేమ పాలన



సంక్షేమ బోర్డు ఆవిష్కరణలో జెడ్పీ చైర్మన్

వి.కోట : చరిత్రలో నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని బోడిగుట్లపల్లె పంచాయతీలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుతం జగనన్న పాలనకు తేడా గుర్తించాకే వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ప్రకారం ఇప్పటికే 99 శాతం హామీలను నెరవేర్చారని తెలిపారు. సంక్షేమ బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ యువరాజ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ తమీమ్, ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం నెరవేరె!



గతంలో కేటీపల్లె మార్గం దుస్థితి (ఫైల్)



నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు

- కొండతిమ్మనపల్లెకు రహదారి
- దశాబ్దాలుగా పట్టించుకోని చంద్రబాబు
- ఎమ్మెల్సీ భరత్ చొరవతో రోడ్డు నిర్మాణం

శాంతిపురం : ప్రతిపక్షనేత చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా వెలగబెట్టినా.. దశాబ్దాలుగా గెలిపించిన కుప్పం నియోజకవర్గ ప్రజలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. పలు గ్రామాలకు కనీస వసతులు కల్పించడంలో సైతం విఫలమయ్యారు. ఇందుకు చిన్నారిదొడ్డి పంచాయతీ కొండతిమ్మనపల్లె (కేటీ పల్లె) ను ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సుమారు 70 ఏళ్లుగా ఈ గ్రామానికి రాకపోకలు సాగించేందుకు కనీసం కాలిబాట కూడా సక్రమంగా ఉండేది కాదు. సుమారు వందకు పైగా కుటుంబాలు, 600 వరకు జనాభా ఉన్న ఈ గ్రామానికి రాళ్లబూదుగూరు నుంచి ఓ మట్టి దారి ఉండేది. కోతకు గుర్తై, గుంతలు తేలిన ఈ బాట మధ్యలో నాగుల చెరువు వంక ఉండటంతో వర్షాకాలంలో రాళ్లబూదుగూరుకు రావాలంటే కోనేరుకుప్పం మీదుగా దాదాపు 4 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. అత్యవసర సమయాల్లో అంబులెన్సు, ఆటోలు కూడా గ్రామానికి రాలేని దుస్థితి. ఏళ్ల తరబడి తమకు రోడ్డు కావాలని గ్రామస్తులు వందల సార్లు అధికారులు, నాయకులకు మొర పెట్టుకున్నారు. ప్రతి జన్మభూమి గ్రామ సభలోనూ అర్జీలు ఇచ్చారు. నేరుగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాళ్లబూదుగూరు పర్యటనకు వచ్చిన నాటి మంత్రి లోకేష్‌కు వినతి పత్రాలు అందించారు. అయినా ఫలితం శూన్యం. గత టీడీపీ హయాంలో చిన్నారిదొడ్డి పంచాయతీని అప్పటి ఎమ్మెల్సీ శ్రీనివాసులు దత్తత తీసుకోవటంతో రోడ్డు నిర్మాణం చేపడతారని భావించిన గ్రామస్తులకు మళ్లీ నిరాశే మిగిలింది. 2013లో తారు రోడ్డు నిర్మిస్తామని హడావుడిగా పనులు ప్రారంభించి భూవివాదాల సాకుతో అర్ధాంతరంగా వదిలేశారు.

ఎట్టకేలకు తీరిన కష్టం

చిన్నారిదొడ్డి సచివాలయ సందర్శనకు 2022 నవంబర్‌లో వచ్చిన ఎమ్మెల్సీ భరత్ దృష్టికి గ్రామస్తులు రోడ్డు సమస్యను తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందించి సిమెంటు రోడ్డు, నాగుల చెరువు వంకపై వంతెన నిర్మాణానికి రూ 2.10 కోట్లు మంజూరు చేయించడమే కాకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించారు. నూతన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు ఇన్నేళ్ల కల సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

వెంటనే స్పందించారు



గత టీడీపీ ప్రభుత్వంలో మా పంచాయతీని దత్తత తీసుకున్న అప్పటి ఎమ్మెల్సీ శ్రీనివాసులు మా ఊరి రోడ్డు విషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. మా ఇబ్బందులను వివరించినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే జగనన్న ప్రభుత్వంలో మా కల నెరవేరింది. ఎమ్మెల్సీ భరత్ దృష్టికి మా సమస్య తీసుకెళ్లగానే వెంటనే స్పందించారు. రోడ్డు వేయించారు.

– వెంకటరాము, గ్రామస్తుడు

మేలు మరువలేం



మా గ్రామానికి రోడ్డు వసతి లేక నానా బాధలు పడ్డాం. ఊరి దాటాలన్నా, పక్కనే ఉన్న రాళ్ల బూదుగూరుకు వెళ్లాలన్నా అగచాట్లు తప్పేవి కాదు. మా ఊరికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులంతా వందల సార్లు అర్జీలు ఇచ్చాం. ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా గ్రామానికి సిమెంట్ రోడ్డు నిర్మించారు. జగనన్న మేలు మరువలేం.

– చంద్రప్ప, గ్రామస్తుడు

క్లుప్తంగా

సేంద్రియ సాగు అభినందనీయం

రామకుప్పం : మండలంలోని అంకిరెడ్డి పల్లె వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన సేంద్రియ సాగు అభినందనీయమని అంతర్జాతీయ బృందం ప్రశంసించింది. మంగళవారం ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో బృందం సందర్శించింది. సంస్థ సీఈఓ రామారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది రైతులు సేంద్రియ విధానంలో పంటలు సాగుచేస్తున్నారని వెల్లడించారు. ఆరోగ్యకరమైన ఆహారం అందించడానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఉపయోగపడతాయన్నారు. ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బృందం రైతులు సేంద్రియ విధానంలో పండించిన పంటలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ అవలంభిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తమ దేశాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు వాసు పాల్గొన్నారు.

లోయర్ గ్రేడ్ పరీక్ష అనుమతికి వినతి



వినతిపత్రం అందిస్తున్న అసోషియేషన్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : టైప్ రైటింగ్ ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్ పరీక్ష పాసైన విద్యార్థులకు పదవ తరగతితో సంబంధం లేకుండా లోయర్ గ్రేడ్ టెస్ట్‌కు అనుమతి ఇవ్వాలని టైప్‌రైటింగ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దీనిపై సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు విన్నవించినట్లు వెల్లడించారు.

సులువుగా సర్టిఫికెట్

జనవాక్కు

మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేదు.. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేదు.. నిర్దేశిత రుసుము చెల్లించనక్కర్లేదు.. నిర్ణీత గడువు వరకు వేచిఉండక్కర్లేదు.. ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు సులువుగా మంజూరు చేశారు. జగనన్న సురక్ష పథకం కింద పైసా ఖర్చు లేకుండా ఇంటి ముంగిటకే సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వం అమలు చేసిన వినూత్న పథకంపై లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్



ధ్రువీకరణ పత్రాలు పొందిన లబ్ధిదారులతో మంత్రి రోజా (ఫైల్)

నమ్మలేని నిజం



కుల ధ్రువీకరణ పత్రం కోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నాం. ఫలితం శూన్యం. అయితే జగనన్న సురక్ష పథకం కింద మాకు కావల్సిన సర్టిఫికెట్‌ను మా ఇంటికే తీసుకువచ్చి ఇచ్చారు. ఇది నమ్మలేని నిజం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం. ఈ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– టి.సుమిత్ర, ఒంటిమిట్ట, పుత్తూరు

అవసరాలను గుర్తిస్తోంది



ప్రజలకు ఏది అవసరమో ప్రభుత్వం పక్కాగా గుర్తిస్తోంది. మాకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాన్ని ఇంటి వద్దకే తీసుకువచ్చి అందించారు. గతంలో ఒక సర్టిఫికెట్ తీసుకోవాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. తహసీల్దార్ కార్యా లయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు పైసా చెల్లించాల్సిన పనిలేకుండా సులువుగా ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తున్నారు.

– ఎస్.హైందవి, రాచపాళెం, పుత్తూరు

జగనన్నకు కృతజ్ఞతలు



గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే నేతల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. అప్పుడున్న జన్మభూమి కమిటీలు చెబితే కాని అధికారులు ధ్రువీకరణపత్రాలు ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం వలంటీర్లు మా ఇంటికే వచ్చి వివరాలు అడిగారు. మాకు అవసరమై సర్టిఫికెట్లకు దరఖాస్తు తీసుకున్నారు. మళ్లీ మా ఇంటి ముంగిటకే తీసుకువచ్చి అన్ని పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– కె.భాగ్యమ్మ, ఊడగమాకులపల్లె, పులిచెర్ల మండలం

మేలు మరువలేం



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకున్నా. ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. అర్హత ఉన్నప్పటికీ కార్డు మంజూరు చేయలేదు. ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకునేవారు. జగనన్న సురక్షలో మా ఇంటికే వచ్చి రేషన్ కార్డు అందించారు. ముఖ్యమంత్రి జగనన్న మేలు మరువలేం.

– ఎస్.ఫమీదా, ఎగువవీధి, కల్లూరు, పులిచెర్ల మండలం

వేగంగా ప్రాధాన్యత భవనాల నిర్మాణం



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రాధాన్యత భవనాల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత వ్యవధిలో భవనాలను పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ లోపు జగనన ఇళ్ల నిర్మాణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాలకు సెక్టోరియల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా మౌలికవసతులను కల్పించాలన్నారు. సెక్టోరల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను డిసెంబర్ 10 లోపు రూపొందించాలని ఆదేశించారు. సమీక్షలో పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా విధుల నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

- నేర సమీక్షలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో పోలీసులు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటి నుంచే శాంతిభద్రతలపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ చోటా ప్రజలకు పోలీసులు కనిపించాలని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు కనిపెట్టాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తప్పనిసరిగా పల్లె నిద్ర చేసి, పరిస్థితులను గమనించాలని కోరారు. సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రణకు అవగాహనక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం, సారా, అక్రమ ఇసుక రవాణాలపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి, సొత్తు రికవరీ చేసిన పోలీసులకు నగదు రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కోళ్లకు పోస్టుమార్టం!

పూతలపట్టు: కోళ్లకు పోస్టుమార్టం చేసిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. మండలంలోని బత్తినవారిపల్లెకు చెందిన సుభాషిణి తన ఇంటి వద్ద కోళ్లు పెంచుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం హఠాత్తుగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో పక్కింటి వాళ్లు చెట్లకు కొట్టిన రసాయన మందుల కారణంగానే తమ కోళ్లు మృతి చెందాయని పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పశుసంవర్ధశాఖ అధికారుల సమక్షంలో కోళ్లకు పోస్టుమార్టం చేయించారు. ల్యాబ్ నివేదిక మేరకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో . మంగళవారం హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, కానిస్టేబుల్ అరుణ ఉన్నారు.

'ఆపస్' నేతలకు సన్మానం

పుత్తూరు: ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ఉపాధ్యక్షుడు దొరస్వామిని మంగళవారం పుత్తూరులో ఘనంగా సన్మానించారు. బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షుడు శివకుమార్, తేజోమూర్తి, ధనుంజయులు, తులసీరామ్, దశరథ, గుర్రప్ప, లోకేష్, చక్రపాణి, జయకర్, కన్నయ్య పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : సమ్మేటివ్–1 పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈఓ విజయేంద్రరావు హెచ్చరించారు. మంగళవారం ప్రారంభమైన పరీక్షలను డీఈఓ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి పర్యవేక్షించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు మొత్తం 2,06,651 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,96,319 మంది హాజరైనట్లు వెల్లడించారు. 10,332 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న పి.తిరుమలేష్ (28)అనే యువకుడిని సెబ్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బంగారుపాళ్యం మండలం గూతూరు వద్ద ఎస్ఐ మోహన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో తిరుమలేష్ పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 480 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. తిరుమలేష్‌కు మద్యం సరఫరా చేసిన సుకుమార్ అనే వ్యక్తిపై సైతం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగని ఏనుగుల దాడులు

పాకాల: మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగుల వరుస దాడులకు పాల్పడుతున్నాయి. తాజాగా సోమవారం రాత్రి ఈ–పాలగుట్టపల్లె, వరదప్పనాయుడుపేట, చంద్రగిరివారిపల్లెలో పంట పొలాలను ధ్వంసం చేశాయి. మంగళవారం బాధిత రైతులు మాట్లాడుతూ ఏనుగులు కొబ్బరిచెట్లు, మామిడి తోటలను నాశనం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడితోపాటు కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రాంభూపాల్

పూతలపట్టు : మండలంలోని కొండకిందపల్లెలో చోరీకి పాల్పడిన నిందితుడిన పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన చంద్రశేఖర్‌నాయుడు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బంగారు నగలు, నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద అస్సాం రాష్ట్రానికి చెందిన నిందితుడు విశాల్‌ఠాకూర్(25)ను ఎస్ఐ రాంభూపాల్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 88 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. విశాల్‌ఠాకూర్ కొండకిందపల్లెలో వెంకటమునినాయుడు అనే రైతు వద్ద కూలి పని చేసుకుంటున్నాడని, చంద్రశేఖర్‌నాయుడు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చోరీకి పాల్పడ్డాడని పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై రాజస్థాన్‌లో కూడా పలు చోరీ కేసులు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్, రైటర్ భాస్క ర్, హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, ముక్తి పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, వేదికపై ఎంపీ రెడ్డెప్ప తదితరులు



ఐదు జిల్లాల నుంచి హాజరైన కుల సంఘాల నేతలు

- తొమ్మిది దశాబ్దాల తర్వాత నిర్వహణ
- ఐదు జిల్లాల కుల సంఘాల నేతలు హాజరు
- శ్రీపద్మావతి యూనివర్సిటీలో ప్రాంతీయ సదస్సు

తిరుపతి అర్బన్: పారదర్శకంగా శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ పరిధిలోని ప్రియదర్శిని ఆడిటోరియంలో కులగణన ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన కుల సంఘాల నేతలు హాజరయ్యారు. ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. సభాధ్యక్షుడిగా కలెక్టర్ వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగితోపాటు వలంటీర్లు కులగణనలో పాల్గొంటారని వెల్లడించారు. ఇంటి సభ్యుల బయోమెట్రిక్‌తోపాటు, సచివాలయ బయో మెట్రిక్ ఉంటేనే యాప్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. వంద శాతం పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తొమ్మిది దశాబ్దాల తర్వాత కుల గణన చేపడుతున్నట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ కులాలు మినహా మిగిలిన వారిని జనరల్ కేటగిరీ కింద లెక్కించనున్నట్లు వివరించారు. కులాల వారీగా జనాభా లెక్కించడం వల్ల ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఉపయోగపడతుందని వివరించారు. కుల సంఘాలతోపాటు రాజకీయపార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంఘాల నేతలు సంపూర్ణంగా సహకరించాలని ఆయన కోరారు.

చారిత్రాత్మకం

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ తొమ్మిది దశాద్దాల తర్వాత కులగణన చేపట్టడం చారిత్రాత్మకమైన అంశమన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి సరైన న్యాయం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన నిర్ణయాన్ని తీసుకున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా రాష్ట్రంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రాజకీయ ఆర్థిక సమానత్వం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ సమాజంలో అంతరాలు తొలగాలంటే తప్పనిసరిగా కులగణన అవసరమన్నారు. చిత్తూరు మేయర్ అముద మాట్లాడుతూ బడుగుల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తున్నారని తెలిపారు. సదస్సులో తిరుపతి డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వివిధ జిల్లా ల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు లక్ష్మయ్య, పుల్లయ్య, సురేంద్రనాథ్, కుమార్‌రాజా, శాంతి, బాబు, షేక్ సిరాజ్‌బాషా, శ్రీరాములు, వేమ నారాయణ, అక్కులప్పనాయక్ తదితరులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. మరికొందరు తమ అభిప్రాయాలను వినతిపత్రం రూపంలో కలెక్టర్‌కు అందించారు. ఈ సదస్సులో తిరుపతి కుల గణన అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే.బాలాజీ, శ్రీపద్మావతి యూనివర్సిటీ వీసీ డీ. భారతి, కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషగిరి, ఎండీ కృష్ణమూర్తి, చిత్తూరు డీఆర్వో రాజశేఖర్, చిత్తూరు జిల్లా కుల గణన అధికారి జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు శాంతి, వనిత, వరలక్ష్మి, సుమతి, తిలక్‌బాబు, వెంకటనారాయణ, భూపేష్ గోపీనాథ్, పురుషోత్తం, ఎల్లప్ప, రమణ, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.